# ఉద్యాన పంటలకు 40 శాతం రాయితీ

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్తగా ఉద్యాన తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులకు ప్రోత్సాహం కల్పించేందుకు హార్టీకల్చర్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు ప్రస్తుత 2025-26 సంవత్సరానికి గాను రాయితీలు నిర్ణయిస్తూ నిర్ణయించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఉద్యాన పంటల సాగుకు 40 శాతం రాయితీని అందచేయనున్నారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ఉద్యాన ఇప్పటికే ఖరారు చేసింది. రాష్ట్రంలో 9,902 ఎకరాలకు సంబంధించి మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగుకు రూ.18.48 కోట్లను కేటాయించారు. కూరగాయల సాగుకు 10వేల ఎకరాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యానికి గాను రూ.9.60 కోట్లు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగు కోసం రూ.2.35 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలాగే రాష్ట్రంలో 2,549 ఎకరాల్లో పూల సాగుకు రూ.2.06 కోట్లు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు రూ.5.33 కోట్లు కేటాయించారు.

అలాగే సేంద్రీయ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు తదితర వాటి ఏర్పాటుకు 30 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. వీటితోపాటు, అదనంగా పుట్టగొడుగుల పెంపకం, వాటి యూనిట్లకు రూ.1.08 కోట్లు, పాత తోటల పునరుద్ధరణకు మరో రూ.2 కోట్లు, నీటి వనరుల సృష్టి కోసం రూ.2.73 కోట్లు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం రూ.14.24 కోట్లు కేటాయించారు. వీటికి 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు.

# భారత్‌లో హమాస్ తరహా దాడులకు ఐఎస్ఐ ఉగ్రవాదుల వ్యూహాలు

## టర్కీ సహకారంతో డ్రోన్‌ల ద్వారా బాంబు దాడులు, రాకెట్ల ప్రయోగం

## ఢిల్లీ కారు బాంబు పేలుడు తరువాత వెలుగులోకి వచ్చిన సంచలన అంశాలు

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** భారత్‌లో దశాబ్దాలుగా విచ్ఛినకర కార్యకలాపాలకు పాల్పడుతున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు తమ వ్యూహాలను మార్చుకున్నారా.? ఇప్పటి వరకు సాగించినట్లుగా బాంబు పేలుళ్లు, పోలీసులపై దాడులకు బదులు ఇజ్రాయిల్‌పై హమాస్ తరహాలో డ్రోన్ల ద్వారా బాంబులు, రాకెట్లను ప్రయోగించేందుకు పథకాలు రచించారా...? ఇందుకు పాక్‌కు అనుంగు మిత్ర దేశం తుర్కియే (పూర్వపు టర్కీ) తనవంతుగా భారీగా డ్రోన్లు, చిన్నపాటి రాకెట్లను అందించేందుకు సిద్ధమయ్యిందా ? ఢిల్లీ కారు బాంబు పేలుడు తరువాత అరెస్టయిన జైష్ ఏ మహమ్మద్ ఉగ్రవాదులను విచారించగా వెల్లడైన సంచలన విషయాలు పోలీసులను షాక్‌కు గురిచేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్ అంశాన్ని పాలస్తీనాతో పోలుస్తూ పాకిస్తాన్ అనేకసార్లు ఐక్యరాజ్యసమితి సహా పలు వేదికలపైన వీరంగం చేయడం తెలిసిందే. కాశ్మీర్ విషయంలో పాక్ అనుబంధంగా వున్న ఉగ్రమూకలు రాబోయే రోజుల్లో ఇజ్రాయిల్‌పై హమాస్ పోరు చేస్తున్న తరహాలో కొత్త పంథాలో దాడులకు పాల్పడేందుకు నిర్ణయించినట్లుగా ఢిల్లీ కారు బాంబు దాడి తరువాత వెలుగు చూస్తున్న విషయాలను బట్టీ పోలీసులు అంచనా వేస్తున్నారు. ఢిల్లీ కారు బాంబు పేలుడు ఆత్మాహుతి దాడిగా నిర్ధారణ అవడం తెలిసిందే. ఈ దాడికి కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ఉమర్ నబీ సుసైడ్ బాంబర్‌గా వ్యవహరించడం విదితమే. ఈ ఘటన తరువాత పలువురు వైద్యులతో పాటు పది మంది ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేయగా కారు బాంబు దాడికి ముందు, ఆ తరువాత చోటుచేసుకున్న పరిణామాలు పోలీసులను ఆశ్చర్యచకితులను చేశాయి. ఉగ్రవాదులు మొదట ఆత్మాహుతి దాడిగా కాకుండా హమాస్ తరహాలో డ్రోన్ల ద్వారా జనం రద్దీగా వుండే ప్రాంతాలలో బాంబులు వేసేందుకు పథకాలు రచించినట్లు పోలీసులకు అందిన సమాచారం రూఢీ చేసింది. దీంతో పాటు చిన్నపాటి రాకెట్లను డ్రోన్ల ద్వారా ఎంపిక చేసిన ముఖ్య నేతలు, సర్కారీ విభాగాల కార్యాలయాలపై దాడులకు కూడా ఉగ్రవాదులు వ్యూహాలు రచించారు. ఇందుకు కావాల్సిన డ్రోన్లను తుర్కియే అందించేందుకు సిద్ధంగా వుందని నిఘా వర్గాలకు అందిన సమాచారం చెబుతోంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాక్‌కు తుర్కియే భారీగా డ్రోన్లను అందించడం తెలిసిందే. తుర్కియే అందించిన డ్రోన్లతో పాక్ భారత్ సరిహద్దులోని రాజస్తాన్, కాశ్మీర్, పంజాబ్‌లలోని గ్రామాలలో దాడులకు దిగడం విదితమే. భారత్ ఫైటర్ జెట్లతో పాక్ మిలటరీ స్థావరాలను ధ్వంసం చేయగా పాకిస్తాన్ మాత్రం డ్రోన్లను వాడి భారత గ్రామాల్లో నష్టం చేకూర్చింది. ఈ దాడులకు ముందు కాశ్మీర్‌లోని పాకిస్తాన్ సరిహద్దులో గల పలు మిలటరీ స్థావరాలపై ఈ ఏడాది వేసవి కాలంలో డ్రోన్ల ద్వారా బాంబు దాడులు జరగడం సంచలనం రేపింది.

భారత మిలటరీ స్థావరాలపై ఉగ్రవాదులు డ్రోన్ల ద్వారా బాంబు దాడులు చేయడం ఇదే తొలిసారి. అంతకు ముందు పంజాబ్, కాశ్మీర్‌లో డ్రోన్ల ద్వారా ఆయుధాలను, మాదకద్రవ్యాలను పాక్ జార విడిచిన ఘటనలు వున్నాయి. అయితే బాంబు దాడులు జరగడం మాత్రం గత వేసవి కాలంలోనే జరిగాయి. ఇప్పుడు ఢిల్లీ కారు బాంబు దాడి తరువాత దేశ వ్యాప్తంగా పలుచోట్ల డ్రోన్ల ద్వారా బాంబులు వేసి విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులు కుట్రు పన్నినట్లు వెలుగు చూసింది. ఈ విషయంలో టర్కీ సహాయం తీసుకునేందుకు ఉగ్రవాదులు నిర్ణయించడంతో పాటు హమాస్ ఉగ్రవాదుల నుంచి శిక్షణ పొందేందుకు సిద్ధమైనట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీనిపై అప్రమత్తమైన కేంద్ర హోం శాఖ ఢిల్లీ, ముంబాయి, కాశ్మీర్ సహా ముఖ్యమైన నగరాలను అప్రమత్తం చేసింది. ఈ నగరాలలో డ్రోన్లను వాడడంపై నిషేధం విధించే యోచనలో వున్నట్లు సమాచారం.



# శబరిమలలో మళ్లీ పెరిగిన రద్దీ

**శబరిమల, నవంబరు 26:** శబరిమలలో మళ్లీ భక్తుల రద్దీ పెరిగింది. వారం క్రితం మాదిరిగా శబరిమల సన్నిధానంలో ఇసుకేస్తే రాలనంతగా అయ్యప్ప భక్తులు కనిపిస్తున్నారు. దీంతో అయ్యప్పస్వామి దర్శనానికి 45 గంటల సమయం పడుతోంది. మండల పూజ సీజన్‌లో భాగంగా ఈనెల 16న శబరిమలలోని అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకోగా.. తొలి నాలుగు రోజుల్లో రికార్డుస్థాయిలో భక్తులు దర్శనానికి తరలివచ్చారు.

వారంరోజుల్లో ఆరున్నర లక్షల మంది భక్తులు అయ్యప్ప స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి దర్శనం కోసం అయ్యప్పభక్తుల కిలోమీటర్ల మేర బారులు దీరారు. తొక్కిసలాట జరగకుండా ఆలయ నిర్వాహకులు, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. క్యూలైన్‌ల లోని భక్తులకు అవసరమైన ఆహార పానీయాలు అందజేస్తున్నారు.

## హాంకాంగ్‌లో హైరైజ్ అపార్ట్‌మెంట్ టవర్లు బుగ్గి

# భారీ అగ్ని ప్రమాదం, 36మంది మృతి

**లండన్, నవంబరు 26:** హాంకాంగ్‌లో హైరైజ్ అపార్ట్‌మెంట్ టవర్లు నాలుగు అగ్నికీలల్లో చిక్కుకుని కుప్పకూలాయి. ఈ ఘటనలో 36 మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడారు. వందల మంది అపార్ట్‌మెంట్ వాసులు అగ్ని కీలల్లో చిక్కుకున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. హాంకాంగ్‌లోని తైపో జిల్లాలో ఓ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ సముదాయంలో నాలుగు హైరైజ్డ్ అపార్ట్‌మెంట్లు ఉండగా, సుమారు 2 వేల కుటుంబాలు నివాసముంటుండగా వందల మంది మంటల్లో చిక్కుకున్నారు. ఇప్పటి వరకు 36మంది మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. అనేక మంది లోపలే చిక్కుకుపోయినట్లు తెలిపారు. మంటల్లో



చిక్కుకున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది.

# రైజింగ్ తెలంగాణకు వ్యవసాయమే కీలకం

## 2047 విజన్‌కు రూపకల్పన
## స్మార్ట్ సాయిల్ టు స్మార్ట్ మార్కెట్
## నీటి వినియోగం, సాంకేతికతతో ఉత్పత్తుల పెంపు లక్ష్యం

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైజింగ్ తెలంగాణలో ప్రధానంగా వ్యవసాయమే కీలకం కానుంది. ఇందులో భాగంగా వ్యవసాయానికి సంబంధించి 2047 విజన్‌కు రూపకల్పన జరుగుతోంది. స్మార్ట్ సాయిల్ టు స్మార్ట్ మార్కెట్, నేల డేటా, స్మార్ట్ వాటర్ వినియోగం మరియు కొత్త వ్యవసాయ సాంకేతికతతో పంటలను పెంచడమే ఈ విజన్ లక్ష్యంగా రూపుదిద్దుకుంటోంది. వ్యవసాయ శాఖ ఉన్నతాధికార వర్గాల సమాచారం ప్రకారం ఒక చిన్న రైతు కాళ్ళ కింద ఉన్న నేల నుండి పంట జన్యువులను ట్రాక్ చేసే ఉపగ్రహాల వరకు, తెలంగాణ రైజింగ్ బై 2047 విజన్ వ్యవసాయాన్ని వాతావరణ స్మార్ట్, సాంకేతికతతో నడిచే వృద్ధి ఇంజిన్‌గా మారుస్తుంది. బ్లూప్రింట్ ఒక స్థితిస్థాపక వ్యవసాయ పర్యావరణ వ్యవస్థను రూపొందింప చేస్తుంది. ప్రతి ప్లాట్‌ను మ్యాప్ చేయడం, నీటి చుక్కను కొలవడం, మిగులు ధాన్యాన్ని అధికవిలువ మార్కెట్లలోకి ప్లగ్ చేస్తారు. క్లైమేట్ స్మార్ట్ రెసిలెంట్ అగ్రి ఎకో సిస్టమ్ కింద రాష్ట్రం ఒక మొబైల్ సాయిల్ టెస్టింగ్ నెట్‌వర్క్‌ను ప్లాన్ చేస్తోంది. ఇది ప్రతి సీజన్‌లో 40 లక్షల నమూనాలను విశ్లేషించి, పంటనిర్దిష్ట సలహాతో జియోట్యాగ్ చేయబడిన సాయిల్ హెల్త్ కార్డులను జారీ చేయగలదని చెబుతున్నారు. కమ్యూనిటీ సాయిల్ మిషన్ ఫీల్డ్ సిబ్బందిని 'సాయిల్ హెల్త్ ఛాంపియన్స్'గా తీర్చిదిద్దనుంది. తెలంగాణ సాయిల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో డేటాను అందించడంతో పాటు, పునరుత్పాదక శక్తితో కూడిన సెటప్ ద్వారా వ్యవసాయ విద్యుత్ లభ్యత 3.5 కిలోవాట్ పర్ అవర్ నుండి 9 కిలోవాట్ పర్ అవర్‌కి పెరగాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కిసాన్ మిత్రాలు, మహిళా గ్రీన్ ఛాంపియన్ల నేతృత్వంలోని 1,000 తెలంగాణ సహజ వ్యవసాయ సమూహాలతో 4 వేల గ్రామాలలో సహజ వ్యవసాయం విస్తరించబడేలా చర్యలు చేపట్టనుంది. బయో ఇన్‌పుట్ కేంద్రాలు, ప్రీమియం మార్కెట్‌లకు లింక్ మద్దతుతో. సమాంతరంగా రూపొందించే ఐఓటి అధారిత సూక్ష్మ-నీటిపారుదల వ్యవస్థ 39.5 లక్షల ఎకరాలను కవర్ చేయనుంది. అన్నీ ప్రిడిక్టివ్ వాటర్ మేనేజ్‌మెంట్ మరియు జిల్లా స్థాయి ప్రణాళిక కోసం స్మార్ట్ ఇరిగేషన్ డాష్‌బోర్డ్‌కు అనుసంధానించబడి ఉంటాయి. అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయడం, అగ్రికల్చర్-హబ్ ను తెలంగాణ అగ్రిటెక్ పరిశోధన-కమ్-సర్టిఫికేషన్ సెంటర్‌గా మార్చడం, వ్యవసాయ డ్రోన్‌లు, ఐఓటి పరికరాలు, ఎఐ సాధనాలకు ఎండ్ టు ఎండ్ పరీక్ష, ధృవీకరణను అందించడంపై పరిశోధన, ఆవిష్కరణల ప్రోత్సాహం కేంద్రీకృతమై ఉంటుందని చెబుతునాన్నరు. హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక అగ్రిటెక్ పరిశోధన నిధి, నానో ఇన్‌పుట్‌ల పరిశోధన కేంద్రం, తెలంగాణ వ్యవసాయ బయోఇన్ఫర్మేటిక్స్ గ్రిడ్ వాతావరణ స్థితి స్థాపక పంట రూపకల్పన కోసం ఒక బహిరంగ, ఎఐ ఆధారిత వేదికగా జన్యు శాస్త్రం, నేల మరియు వాతావరణ డేటాను కలిపే దిశగా ఏర్పాటు చేయనుంది. మరోపక్క ఇంటెన్సివ్ వ్యవసాయం, విలువ జోడింపులో, జిల్లా స్థాయి కేంద్రాల మద్దతుతో, తెలంగాణ ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని 2.43 లక్షల నుండి 11.83 లక్షల ఎకరాలకు విస్తరించడం, నూనెగింజల ఉత్పత్తిని రెట్టింపు చేయడం ద్వారా 14.86 లక్షల టన్నులకు పెంచాలని చూస్తోంది. దీంతోపాటు, ఉద్యానవన మెగా క్లస్టర్లు, పెరి-అర్బన్ కూరగాయల బెల్టులు, 100 ఎగుమతి వస్తువుల క్లస్టర్లు, ఎఐ, ఐఓటి, ధాన్యం వ్యవస్థలలో బ్లాక్ చెయిన్ మద్దతుతో అంకితమైన బియ్యం ఎగుమతి విభాగం ఉత్పాదకత లాభాలను స్థిరమైన, అధిక రైతు ఆదాయంగా మారుస్తాయని భావిస్తోంది. అలాగే 2047 నాటికి పట్టు ఉత్పత్తిలో జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఎదగాలని తెలంగాణ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. మల్బరీ సాగును 47,188 ఎకరాలకు పెంచాలనే ప్రతిష్టాత్మక లక్ష్యంతో ఈ విస్తరణ ముడి మల్బరీ పట్టు ఉత్పత్తిని ఐదు రెట్లు పెంచి 2,335 టన్నులకు చేరుస్తుందని, టాసర్ పట్టు ఉత్పత్తిలో ఎనిమిది రెట్లు పెరుగుదలను 68.14 టన్నులకు చేరుకుంటుందని అంచనా. ఈ వృద్ధి లక్ష్యాలు తెలంగాణ ఉత్పత్తిని గణనీయంగా పెంచే దిశగా విజన్ రూపుదిద్దుకుంటోందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

# రాష్ట్రాలు వేరైనా ప్రజలంతా ఒక్కటే

## రాజ్‌భవన్‌లో నార్త్ ఈస్ట్ కనెక్ట్ సదస్సులో పాల్గొన్న దామోదర్ రాజనర్సింహ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్26:** తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్‌లో భాగంగా రాజ్‌భవన్‌లో జరుగుతున్న ఆరోగ్య సదస్సులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. రాష్ట్రాలు వేరైనా, భారతదేశ పౌరులుగా మనమంతా ఒక్కటేనని, పరస్పర సహకారంతో కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని మంత్రి పిలుపునిచ్చారు. భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు భారతదేశ బలం అని, ఆ భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకుంటూ దేశాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహద పడుతాయన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రమేదైనా, ఏ ప్రాంతంలో నివసించే ప్రజలైనా ఆరోగ్యం విషయంలో కోరుకునేది ఒక్కటే... అనారోగ్యం, అత్యవసర ఆపద వచ్చినప్పుడు తక్షణ, మెరుగైన వైద్య సేవలు పొందాలని, చికిత్స అయ్యే ఖర్చు అందుబాటులో ఉండాలని అనుకుంటారు. ప్రభుత్వాలుగా ప్రజలకు ఏది అవసరమో అది ఇస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం మన బాధ్యత. ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోంది. క్షేత్రస్థాయిలో సబ్ సెంటర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రైమరీ, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవఖానల్ల ద్వారా ప్రివెంటివ్ అండ్ ప్రైమరీ హెల్త్ సర్వీసెస్ అందిస్తున్నాం. సెకండరీ




లెవల్‌లో (184) కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లలో స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నాం. గాంధీ, ఉస్మానియా వంటి 48 టీచింగ్ హాస్పిటళ్ల ద్వారా టెర్షియరీ కేర్ సేవలు అందిస్తున్నాం. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఉస్మానియా నూతన హాస్పిటల్, హైదరాబాద్‌లో 3 టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ హెల్త్ సిటీ నిర్మిస్తున్నాం. 32 డయాగ్నస్టిక్స్ సెంటర్స్ ద్వారా ప్రభుత్వ దవాఖానల్లకు వచ్చే పేషెంట్లకు ఉచిత, నాణ్యమైన డయాగ్నస్టిక్స్ సేవలు అందిస్తున్నాం. ఈ సేవలను ట్రైబల్ ప్రాంతాల్లోనూ అందించేందుకు రాష్ట్రంలో ఉన్న 4 ఐటీడీఏల పరిధిలో హబ్స్ ప్రారంభిస్తున్నాం. ఇవేగాకుండా ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ లోనూ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 2007లో ప్రారంభించుకున్నాం. ఇప్పుడు 1800లకు పైగా రకాల వైద్య సేవలు, సర్జరీలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందుతున్నాయి. డయాబెటీస్, హైపర్ టెన్షన్, కిడ్నీ, గుండె జబ్బుల వంటిపెరుగుతున్న నాన్ కమ్యునికెబుల్ డిసీజెస్ బర్డెన్‌ను ఎదుర్కొనేందుకు గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీడీ క్లినిక్స్ ఏర్పాటు చేశాం. సుమారు 50 లక్షల మంది పేషెంట్లకు వన్ పాయింట్ డెస్టినేషన్‌గా ఈ క్లినిక్స్ సేవలు అందిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 3 డయాలసిస్ సెంటర్ల ద్వారా సుమారు 1200 మంది పేషెంట్లకు డయాలసిస్ సేవలు అందించాం. ఈరోజు 102 డయాలసిస్ సెంటర్ల ద్వారా 12 వేల మంది పేషెంట్లలు సేవలు అందిస్తున్నాం. సగటున 20 కిలోమీటర్లకు ఒక సెంటర్ ఉండే విధంగా మరో 79 సెంటర్లను ప్రారంభించాలని నిర్ణయించాం. దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న కేన్సర్ కేసులను దృష్టిలో పెట్టుకుని ప్రతి జిల్లాలో డే కేర్ కేన్సర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎంసీహెచ్‌లు, ఆరోగ్య మహిళ క్లినిక్స్, మైత్రి క్లినిక్స్ ద్వారా పిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందిస్తున్నాం. దేశంలోనే తొలిసారిగా, ప్రభుత్వ హాస్పిటళ్లలో ఐవీఎఫ్ సేవలను తెలంగాణలో అందిస్తున్నాం. ఇలా అన్ని రకాలుగా ప్రజలకు వైద్యపరంగా ఏది అవసరమో, ఆ సేవలను అందిస్తూ ముందుకెళ్తున్నాం. భవిష్యత్తులో హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం కేపిటల్‌గా డెవలప్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతున్నాను. ఈశాన్య రాష్ట్రాల్లో ఆరోగ్యపరంగా ఎటువంటి సహకారానికైనా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# పవర్ స్కామ్‌కు తెరలేపిన ప్రభుత్వం

## పవర్ ప్రాజెక్టుల్లో రూ.50వేల కోట్ల అవకతవకలు

## ప్రతి నిర్ణయంలో కమీషన్: హరీశ్‌రావు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్26:** కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ.50వేల కోట్ల పవర్ స్కామ్‌కు తెరలేపిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో పవర్ ప్లాంట్ల ఏర్పాటుతో 30, 40శాతం కమీషన్లు తీసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏం చేసినా ఒక మిషన్ ఉంటుంది.. ఆ మిషనే కమీషన్ కమీషన్లు ఎలా కొల్లగొట్టాలి అని మాత్రమే ఆయన ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆరోపించారు. వాటాల పంపిణీ విషయంలో మంత్రులు ఘర్షణ పడుతున్నారు. మంత్రుల కుటుంబ సభ్యులే బయటకు వచ్చి వాటాల అంశంపై చెబుతున్నారని పేర్కొన్నారు.



రాష్ట్రాన్ని ఆరాచకాలకు కేంద్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారుస్తోందన్నారు. కొత్తగా పాల్వంచ, రామగుండం, మక్తల్ 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి రూ.50వేల కోట్లు అవసరం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.10వేల కోట్లు చెల్లించాలి. అప్పుగా రూ.40వేల కోట్లు తేవాలి. ఈ అప్పు ఎక్కడి నుంచి తెస్తారు? "అని హరీష్ రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో విధాన నిర్ణయాల కోసం నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాలు, ఇప్పుడు పంపకాల కోసం మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశాలు వరుసగా భూ స్కాం. పవర్ స్కాం కోసం జరిగాయని ఆయన విమర్శించారు. తమ పార్టీ ఇప్పటికే రూ.5లక్షల కోట్ల ల్యాండ్ స్కాం బయట పెట్టినా ప్రభుత్వం దానిపై ఒక్క సమాధానం కూగా చెప్పలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అరాచకం రాజ్యమేలుతుందని కెసిఆర్ గతంలో చెప్పిన విషయం ఇప్పుడు నిజమవుతోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే వెంటనే డర్టీ పాలిటిక్స్‌కు తెర తీస్తున్నారని, వాటాల విషయంలో మంత్రులే అంతర్గత తగాదాల వల్ల మంత్రులే రోడెక్కే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్టీపిసి తక్కువ ధరకే విద్యుత్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని లేఖ రాసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. దామరచర్లలో పవర్ ప్లాంట్ నిర్మాణంపై గతంలో తీవ్రంగా విమర్శించిన మంత్రి కోమటిరెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

# వచ్చే ఆగస్టు రెండున అత్యంత సుదీర్ఘ సూర్య గ్రహణం

## యూరప్, మధ్య ఆసియా, అట్లాంటిక్ మహా సముద్రంలో స్పష్టంగా కనిపించనున్న గ్రహణం

## భారత్‌లోని మూడు నగరాలలో పాక్షికంగా కనిపించే అవకాశం

**హైదరాబాద్, నవంబరు 26, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది ఆగస్టు రెండవ తేదీన ఖగోళంలో మరో అద్భుతం కనువిందు చేయనుంది. ఈ శతాబ్దపు అతిపెద్ద సంపూర్ణ సూర్యగ్రహణం ఆ రోజున పట్టపగలు ఏర్పడనుంది. ఆరు నిమిషాల 23 సెకన్ల పాటు సూర్యుడు పూర్తిగా చంద్రుడి ఛాయలో వెళ్లనున్నాడు. దీని కారణంగా సంపూర్ణ గ్రహణం ఏర్పడే దేశాలలో అంధకారం ఏర్పడనుందని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇలాంటి సంపూర్ణ సూర్య గ్రహణం మరో వంద



సంవత్సరాల తరువాతే ఏర్పడుతుందని వారంటున్నారు. మొదటగా అట్లాంటిక్ మహా సముద్రంలో ఏర్పడనున్న ఈ సూర్య గ్రహణం ఆ తరువాత యూరప్‌తో పాటు మొరాకో, అల్జీరియా, తునీషియా, లిబియా, ఈజిప్ట్, మధ్య ఆసియా, దక్షిణ అమెరికా దేశాలలో కనిపించనుంది. బ్రెజిల్ దేశం ఈ అద్భుత సంపూర్ణ సూర్యగ్రహణ వీక్షణకు వేదిక కానుంది. ఈ దేశంలోని రెండు చోట్ల సంపూర్ణ సూర్యగ్రహణం స్పష్టంగా కనిపించనుందని ఖగోళ శాస్త్రవేత్తలు ప్రకటించడంతో ఆ ప్రాంతంలో అప్పుడే సందడి మొదలయ్యింది. భారత్ వరకు వస్తే ముంబాయి, రాజస్తాన్‌లోని జైసల్మేర్, గుజరాత్‌లోని భుజ్ ప్రాంతాలలో పాక్షికంగా కనిపించనుంది. ఈ మూడు నగరాలలో మధ్యాహ్నం 3.34 గంటల నుంచి సాయంత్రం 5.53 గంటల వరకు కొద్ది నిమిషాల తేడాతో గ్రహణం కనిపించనుంది. హైదరాబాద్ వరకు వస్తే కొంత అస్పష్టంగా ఈ గ్రహణం సాయంత్రం 3. 58 గంటల నుంచి సాయంత్రం 5.33 గంటల వరకు కనిపించనుంది. సాధారణంగా ప్రతీ 18 నెలలకు ఒకసారి సూర్య గ్రహణం ఏర్పడుతుంది. అన్ని సూర్య గ్రహణాలు సంపూర్ణ సూర్య గ్రహణాలుగా వుండవు. ఇక సంపూర్ణ సూర్య గ్రహణాలు కూడా మూడు నుంచి ఐదు నిమిషాల వరకే పరిమితమవుతాయి. కానీ ఆగస్టు రెండవ తేదీ నాటి సంపూర్ణ సూర్య గ్రహణం ఆరు నిమిషా 23 సెకన్ల పాటు వుండనుంది. ఇంత సుధీర్ఘ సూర్య గ్రహణం సంభవించడం గడచిన 123 ఏళ్లలో ఇదే తొలిసారని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈసారి సంభవించనున్న సంపూర్ణ సూర్య గ్రహణం జ్యోతిష్య పండితులతో పాటు వాతావరణ హెచ్చు తగ్గులను పరిశీలించే శాస్త్రవేత్తలకు, జంతువుల విపరీత ప్రవర్తనపై పరిశోధన చేసే జంతు శాస్త్రవేత్తలకు సాధనంగా వుండనుంది.

# వసతి సముదాయాల ఆధునీకరణకు

## దాత మంతెన రూ.9కోట్లు భూరి విరాళం

**తిరుమల, నవంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై అత్యంత భక్తివిశ్వాసాలు కలిగిన ఓ దాత తనవంతుగా భూరీ విరాళాన్ని టిటిడికి అందించాడు. అమెరికాకు చెందిన ప్రవాసభారతీయుడు మంతెన రామలింగరాజు తన కుమార్తె మంతెన నేత్ర, అల్లుడు వంశీ గాదిరాజుల పేరుపై తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల ఆధునీకరణకు ఈ భారీ 9కోట్ల రూపాయలు విరాళాలను అందించారు. బుధవారం ఉదయం



తిరుమల పద్మావతి అతిధి గృహంలో దాత మంతెన రామలింగరాజు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కుటుంబసభ్యులతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా దాతను టిటిడి అభినందించింది. 2012లో కూడా దాత రామలింగరాజు టిటిడికి 16.06కోట్లు విరాళంగా ఇచ్చారని తెలిపారు. తిరుమలలో భక్తులకు మౌళిక సదుపాయాల కల్పనలో తనవంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ఆయనను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అభినందించారు. భవిష్యత్తులో టిటిడికి మరిన్ని విరాళాలందించాలని ఆయన ఆశించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఉన్నారు.

